పనుల్లో వేగం పెంచండి

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- నూతన మున్సిపాలిటీలకు శాశ్వత భవనాలు
- అభివృద్ధి పనులకు వెంటనే నిధులు..
- ఈనెల 10న రిజర్వాయర్ల ప్రారంభం..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణాలు, డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్లు, హెచ్ఎండబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పాటైన ఇంద్రేశం, జిన్నారం, ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదల మున్సిపాలిటీలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. నూతన మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తెచ్చారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించి రాంకీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్ ప్లాంటుకు చెత్తను తరలించేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నిర్మించిన నూతన రిజర్వాయర్లను సెప్టెంబర్ 10న ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే, గుమ్మడిదల నుంచి కానుకుంట రహదారి మరమ్మతు పనులు ప్రారంభించామని తెలిపారు. వర్షాకాలం ముగిసిన వెంటనే శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు కారణంగా నియోజకవర్గ పరిధిలో ధ్వంసమైన రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి సహకరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు అన్నారం నుంచి జంగంపేట రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు హానర్ పరిశ్రమ యాజమాన్యానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇందుకు సీఎస్ఆర్ నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను సోమవారం ఝరాసంగం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో అధికారులు, నాయకులు పంపిణీ చేశారు. 156 రేషన్ కార్డులు కొత్తగా మంజూరయ్యాయని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి హర్షవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, నాయకులు మల్లయ్య స్వామి, మల్లికార్జున పాటిల్, అష్రఫ్ అలీ, లియకత్ అలీ, రాజేందర్ సింగ్, డీలర్ సంగన్న, నర్సింలు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గౌరైగట్టు గ్రామంలో..

మునిపల్లి(అందోల్): లబ్ధిదారులకు మాజీ ఎంపీటీసీ పాండు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని గౌరైగట్టు గ్రామంలో దామోదర ఆదేశాలతో లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులను అందజేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, రాయికోడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమరేశ్వర్, మాజీ ఉపసర్పంచ్ వీరన్న పాటిల్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



విద్యార్థులకు అవగహన కల్పిస్తున్న డా.రాజేష్

జహీరాబాద్ టౌన్: దిగ్వాల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సీపీఆర్‌పై డాక్టర్ రాజేశ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఆర్ విధానం గురించి ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలన్నారు. కార్డియాక్ సమస్యలతో వచ్చే మరణాలను అదుపు చేయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, విద్యార్థులు ఉన్నారు.

సెప్టిక్ ట్యాంక్ అన్‌లోడ్ అడ్డగింత



సెప్టిక్ ట్యాంకును అడ్డుకున్న గ్రామస్తులు

మునిపల్లి(అందోల్): సెప్టిక్ ట్యాంక్ అన్‌లోడ్‌ను పెద్దగోపులారం గ్రామస్తులు అడ్డుకున్నారు. సోమవారం మండలంలోని పెద్దగోపులారం గ్రామ శివారులో సెప్టిక్‌ను ట్యాంక్ అన్‌లోడ్ చేస్తుండటంతో స్థానికులు అడ్డుకున్నారు. వ్యర్థాలు మిషన్ భగీరథ నాలాలోకి చేరి నీరు కలుషితవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి ఘటన రెండవసారి కావడంతో గుర్తించిన గ్రామస్తులు సెప్టిక్ ట్యాంక్ వాహనాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఘనంగా ఎల్ఐసీ వార్షికోత్సవం



కేక్ కట్‌చేస్తున్న మేనేజర్ రాజు తదితరులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని కార్యాలయంలో ఎల్ఐసీ 69వ వార్షికోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బ్రాంచ్ మేనేజర్ రాజు ఉద్యోగులు, ఏజెంట్లతో జ్యోతి ప్రజ్వలన, కేక్‌కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 4 వరకు బీమా వార్షికోత్సవాలు జరుపుకొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్‌రావు, డీఓలు నరేంద్రరెడ్డి, రాజు, లియాఫీ అధ్యక్షుడు విటల్‌గౌడ్, అధికారులు రఘురాం శాస్త్రి, నరసింహ, యూనియన్ నాయకులు అశోక్, ఎనివాస్, ఎజెంట్లు సుభాష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బై..బై.. గణేశా..



కొండాపూర్: నిమజ్జనానికి తరలిన చిన్నారులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధి న్యూ మల్కాపూర్‌లోని సువిధాన్ నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన బాలగణేషుడికి సోమవారం చిన్నారులు నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కాలనీలోని యువత జై జై గణేశా అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు.

గురునగర్ కాలనీలో..

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని గురునగర్ కాలనీలో శ్రీబోలేనాథ్ వినాయక మండపం నిర్వాహకులు ఆదివారం నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోడూరి శరత్‌చంద్ర ఆధ్వర్యంలో కోలాటం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, సిద్ధన్న, ఈశ్వర మార్కండేయ మందిరం పాలకమండలి చైర్మన్ వెంకన్న భక్తులు పాల్గొన్నారు.

కన్‌సాన్‌పల్లి గ్రామంలో

వట్‌పల్లి(అందోల్) మండల పరిధి కన్‌సాన్‌పల్లి గ్రామంలో సోమవారం వినాయకుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈశ్వరాలయం వద్ద మహాదేవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు ఆరు రోజుల పాటు పూజలందుకుని నిమజ్జనానికి తరలించారు. ఆట,పాటల మధ్య వినాయకుడిని ఊరేగింపు చేపట్టారు. చిన్న పిల్లలు, యువకులు సంతోషాలతో డ్యాన్సులు చేశారు. ఊరేగింపు అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.



సదాశివపేట(సంగారెడ్డి): నిమజ్జన కార్యక్రమంలో..

గణనాథుడికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కాటా సుధారాణి

పటాన్‌చెరు: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా అమీన్‌పూర్ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీల్లో సోమవారం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధారాణి గణేశ్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

లడ్డూను దక్కించుకున్న నిజాముద్దీన్



లడ్డూను అందజేస్తున్న నిర్వాహకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): వినాయక లడ్డూ వేలం పాటలో రూ.51వేలకు ఓ మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి లడ్డూను కైవసం చేసుకున్నాడు. మండల పరిధి ముంగి గ్రామంలో ఆదివారం నిర్వహించిన వినాయక నిమజ్జనం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలో స్వామివారి లడ్డూ(ప్రసాదం)ను నిర్వాహకులు వేలంపాట నిర్వహించారు. లడ్డూ వేలం పాటలో గ్రామానికి చెందిన నిజామోద్దీన్, నిరంజన్ పోటీ పడ్డారు. చివరకు నిజాముద్దీన్ రూ.51వేలుకు కై వసం చేసుకున్నాడు. కుల, మత భేదాలు లేకుండా గ్రామంలో అన్ని పండుగలను కలసిమెలసి జరుపుకొంటామన్నారు. లడ్డూను కైవసం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నాడు.

అన్నపూర్ణేశ్వరుడిగా గణనాథుడు



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధి గణేష్ గడ్డ దేవస్థానంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో స్వామివారిని ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గణనాథుడిని ప్రత్యేక అలంకరణలో భాగంగా అన్నపూర్ణేశ్వరుడి అలంకరించారు. అనంతరం దేవాలయం ఆవరణలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాలలో భాగంగా స్వామివారిని రోజుకు ఒక్క అలంకరణలో ముస్తాబు చేస్తున్నామని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా 9 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ఐదుగురికి రూ.1500, మరో నలుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

10న ఓటర్ల తుది జాబితా

రాయికోడ్(అందోల్): ఈ నెల 10న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించనున్నట్లు ఎంపీడీఓ ఎం.ఎం.షరీఫ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు, 66 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. 6న ఓటర్లు, పోలింగ్ కేంద్రాల ముసా యిదా జాబితాను ప్రకటిస్తామన్నారు. 6 నుంచి 8వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, వినతులు స్వీకరిస్తామని చెప్పారు. 8న పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు.

క్రీడల్లో రాణించాలి

జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీజీఆర్ ట్రస్ట్ తరపున క్రీడాదుస్తులను గోవర్ధన్ రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడారంగంలో పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా మంగళవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రైల్వే క్వార్టర్స్, ఎంఐజీ, హెచ్ఐజీ కాలనీలో 10:30 గంటల నుంచి 12 గంటల వరకు, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మైహెయిర్, హుడా కాలనీలో 12 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు, పాత ఎంఐజీ, విద్యుత్‌నగర్, మాక్స్ సొసైటీ కాలనీలో 10 గంటల నుంచి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

రాయికోడ్(అందోల్): మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసే పూర్వ ప్రాథమిక పాఠశాల నిర్వహణకు టీచర్, ఆయా పోస్టుల కోసం దరఖాస్తులను స్వీరించనున్నట్లు ఎంఈఓ మాణెయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడిపల్లి గ్రామానికి చెందిన వారై ఉండాలన్నారు. టీచర్ పోస్టుకు ఇంటర్మీడియెట్, ఆయా పోస్టుకు 7వ తరగతి చదివి ఉండాలన్నారు. 44 ఏళ్ల లోపు వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు రాయికోడ్‌లోని ఎంఆర్‌సీలో సంప్రదించాలన్నారు.

పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సత్తయ్య

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లిలో నూతన పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని సోమవారం సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, జోగిపేట సీఐ అనిల్‌కుమార్ పరిశీలించారు. ఆస్పత్రి పక్కన, గౌరైకల్ వెళ్లే రోడ్డు పక్కన, విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గరలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు. ఇటీవల మొదటగా పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీఓ, మహిళా సమాఖ్య కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం గౌరైకల్ వెళ్లే దారిలో సర్వే నం.11లో సర్వే చేసి ఎకరం స్థలాన్ని కేటాయించి హద్దులు గుర్తించారు. పదిగుంటల స్థలం పోలీస్‌స్టేషన్‌కు సరిపడదని భావించి మరో రెండు చోట్ల స్థలాలను గుర్తించినట్లు తెలిసింది. దాదాపుగా తొమ్మిదేళ్లుగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఓ గదిలో అరకొర వసతుల మధ్య కొనసాగుతూ వస్తున్నది. ఎస్ఐ లవకుమార్, మాజీ ఎంపీపీ పత్రివిఠల్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్ పాటిల్, ఏఎంసీ డైరెక్టర్ దిగంబర్‌రావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు కుత్బొద్దీన్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నారింజ ప్రాజెక్టు సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఈ పోచమల్లు

జహీరాబాద్: మండలం పరిధి కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టును సోమవారం సంగారెడ్డి సర్కిల్ ఇరిగేషన్ పర్యవేక్షక ఇంజనీర్ పోచమల్లు సందర్శించారు. పర్యవేక్షక ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా నారింజ ప్రాజెక్టును సందర్శించి, ప్రాజెక్టు సామర్థ్యం, సాంకేతిక అంశాలను జహీరాబాద్ ఈఈ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు మూడువేల ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్ చేశారని, అయితే ప్రస్తుతం నీటి నిల్వకోసమే ప్రాజెక్టు ఉపయోగపడుతోందని వివరించారు. 85 మిలియన్ క్యూబిక్ ఫీట్ల సామర్థ్యం కలిగి ఈ ప్రాజెక్టు మూలంగా జహీరాబాద్ ప్రాంతంలో నీటి ఎద్దడి సమస్య ఉండదన్నారు. ఐదున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం గేట్ల పరిస్థితి బాగా లేనందున వీలైనంత తొందరలో నిధులు మంజూరు చేయించుకుని కొత్త గేట్ల ఏర్పాటుతో పాటు యాంత్రిక మరమ్మతులు సైతం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రేఖ, జనార్దన్ రావు, రాజ్యలక్ష్మి, ఏఈఈలు పాండు, జానకిరామ్, సిబ్బంది రఘు, మహబూబ్‌అలీలు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయండి

జోగిపేట(అందోల్): జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం భోజన విరామ సమయంలో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాల బాలికల కళాశాల, కో ఎడ్యుకేషన్ అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అధ్యాపకులు విట్టల్ శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, మల్లేశం, ప్రవీణ్‌కుమార్, నూనె శ్రీనివాస్, కమలాకర్, అనిత, బాలాజీ మంజుల, శ్రావణి, సుచరిత, అంకమ్మగౌడ్, ఉద్దీన్ పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ఉత్సాహంగా రీడ్ ప్రోగ్రాం



రీడ్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన రీడ్ ప్రోగ్రాంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని హెచ్ఎం బి.శ్రీనివాస్ పర్యవేక్షించి మాట్లాడారు. రీడ్ ప్రోగ్రాంతో విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. పుస్తకపఠనం మెరుగుపడేందుకు దోహదపడుతుందన్నారు. విద్యార్థులు కొత్త పదాలు నేర్చుకోవడంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పుస్తక పఠనానికి ప్రత్యేక సమయం కేటాయిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు సల్మా, శ్రావణి, శోభ, విద్యార్థులు ఉన్నారు.

యూరియా కొరతతో అవస్థలు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ప్రావీణ్యకు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని చౌటకూర్, పుల్‌కల్, అందోల్, వట్టిపల్లి, కొండాపూర్, సదాశివపేట, మునిపల్లి, సంగారెడ్డి, కంది, నారాయణఖేడ్, కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేట్ మండలాల్లో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల సమస్యలు పట్టడం లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల యూరియా కొరత ఏర్పడిందని మండిపడ్డారు. రైతులకు సరిపడాను యూరియాను సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ సీపీఎం నాయకులు రమేష్‌గౌడ్, సురేష్, మహేష్, మైపాల్, శ్రీనివాస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సమావేశం



స్థలాన్ని పరిశీలిస్తున్న పండితులు, నాయకులు

జిన్నారం(పటాన్ చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని కల్యాణ రామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. రాజగోపురం నిర్మించే విషయంపై ఆగమన శాస్త్ర పండితులు ప్రకాష్ పంతులు ఆధ్వర్యంలో చైర్మన్ మద్దుల బాల్‌రెడ్డి సమావేశంలో చర్చించారు. ఆలయ అభివృద్ధిలో అందరి సహకారంతో ముందుకు వెళ్లేందుకు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు సుక్కయ్య, సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి కొండల్ రెడి పాల్గొన్నారు.

నెలలోపే పెన్షన్ ప్రయోజనాలు

ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్‌అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. సోమవారం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కార్యాలయంలో ప్రయాస్ పథకం ద్వారా పదవీ విరమణ పొందిన 41 మంది చందాదారులకు పీఎఫ్ పత్రాలు జారీ చేశారు. అందులో 10 మందికి డివిజన్ పరిధిలోని కార్యాలయంలో అందజేశారు. అనంతరం విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ... 'ప్రయాస్' కార్యక్రమం ద్వారా చందాదారులకు మెరుగైన సేవలందించాలనే నిబద్ధతను నెరవేర్చడానికి ఒక ప్రయత్నం అని అన్నారు. కార్యక్రమానికి పీఎఫ్ కమిషనర్-దిలీప్ మీనా, అకౌంట్స్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.



పీఎఫ్ పత్రాలు అందజేస్తున్న కమిషనర్

శాంతియుతంగా నిమజ్జనాలు

నారాయణఖేడ్: వినాయక నిమజ్జనాలు ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి సూచించారు. నిజాంపేట్ లో వినాయక మండపాల ఉత్సవ కమిటీ బాధ్యులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల చెరువుల్లో భారీగా నీరు నిల్వ ఉన్నందున నిమజ్జన సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

సదాశివపేట(సంగారెడ్డి): వర్షాలకు గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు , వీధిదీపాల సమస్యలను పరిష్కరించాలని 6వ వార్డు శ్రీకృష్ణ నగర్ ప్రజలు మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాలనీలో రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో వినాయక నిమజ్జన ఊరేగింపునకు ఇబ్బంది కలుగుతుందని కాలనీవాసులు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దేవేందర్ యాదవ్‌కు పరామర్శ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాగం దేవేందర్ యాదవ్‌ను సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల దేవేందర్ యాదవ్ తండ్రి రాగం కొమరయ్యయాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

◆ మహిళలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్ : గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా బ్యూటీ పార్లర్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందని వసతి, భోజనం ఉచితమని తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా చెందిన నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9490103390, 9490129839 నంబర్లకు సంప్రదించాలన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జహీరాబాద్: లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలాల పార్టీ అధ్యక్షుల చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. 13 మంది లబ్ధిదారులకు రూ.6.03 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు.

◆ పాఠశాల జాతీయ సంపద

నారాయణఖేడ్: పాఠశాల జాతీయ సంపద అని వాటిని కాపాడుకుంటూ జ్ఞానాన్ని, క్రమశిక్షణను పెంపొందించుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఖేడ్ మండల అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, ఏబీఆర్ఎస్ఎం సంఘాల పిలుపు మేరకు సోమవారం ప్రభుత్వ బడుల్లో 'మన పాఠశాల-మన ఆత్మగౌరవం' పేరిట ప్రతిజ్ఞ నిర్వహించారు. ఖేడ్ మండలం రుద్రారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులంతా సోదరభావంతో ఉంటూ మంచి వ్యక్తిత్వ నిర్మాణం ద్వారా సమాజం, దేశం అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు గోవింద్, శివాజీ, దత్తాత్రి, సుకుమార్, జైపాల్ పాల్గొన్నారు.

◆ కళ్లద్దాల పంపిణీ

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో జే.కే ఫెన్నర్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. శిబిరంలో 139 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, పరిశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.